## చిన్నకథ



**నాకు సుశీల మాట వింటే చాలు ఏడుపొస్తుంది.**

**నిగ్రహించుకుంటాను.**

**అది మా పక్కింట్లో వుంటుంది. నా వయస్సుదే. నాతోటే చదువుకున్నది. పదో తరగతి పరీక్షలు రేపనగా వాళ్లమ్మ చచ్చిపోయింది. అది పరీక్ష రాయలేదు. ఆ రోజుతోటే దాని చదువుకు గండికొట్టేసింది.**

**నాకు ఏడుపు వచ్చింది.**

**నిగ్రహించుకున్నాను.**

# నాకు ఏడుపు వచ్చింది

-పి.ఎస్.నారాయణ

తల్లి చనిపోయిన సంవత్సరం తిరుగుతూనే ఆ ఇంట మరో ఆడమనిషి ప్రవేశించింది. దానికి సవతి తల్లి రూపంలో. కొద్దిరోజుల్లోనే సుశీల తన స్వంత ఇంట్లోనే పనిమనిషిలా మారిపోయింది. ఇంటి చాకిరంతా చేయాలి. చెల్లెళ్లను తీర్చిదిద్ది బడికి పంపాలి. ఇంట్లో మరో ఆడమనిషి వున్నదని పేరేగాని– ఆమె దిష్టి బొమ్మలా అలంకరించుకొని హాల్లో ఆ ఇంటికి మహారాణిలా కూర్చుని వుంటుంది. ఇదే వంట చేయాలి. వడ్డించాలి. అందరికి అయిన తరువాత తను తినాలి.

నా వయస్సుదే అయినా చిక్కి సగమయి కళ్లల్లో ప్రాణాలు పెట్టుకు బ్రతకసాగింది.

దాన్ని చూస్తుంటే నాకు ఏడుపొస్తుంది.

నిగ్రహించుకుంటాను.

ఆ సవతి తల్లి వరసకో తమ్ముడున్నాడు తాగుబోతు. అంతేకాకుండా పచ్చి తిరుగుబోతు. దానికి వాడితో పెళ్లి అయిన నెల రోజుల్లోనే తెలుసుకుంది. తండ్రి ఏమీ చేయలేకపోయాడు. పాపం ఆయనకు నోట్లో నాలికలేదు.

సుశీలకు అసలు సవతి తల్లి వైపు మనిషిని వివాహం చేసుకోవడమే ఇష్టం లేదు. పెళ్లికి ముందు మా పెరట్లో నా ముందు నిలబడి కళ్లనీరు పెట్టుకుంది.

దాని మాటలు వింటుంటే నాకు ఏడుపొచ్చింది.

అయినా నిగ్రహించుకున్నాను.

"నువ్వే చాకచక్యంగా అతడిని నీవాడిని చేసుకోవాలి. ఈమె చెడ్డదని అతడూ చెడ్డవాడు అవ్వాలనేం లేదు కదా!" అంటూ సముదాయించాను. అంతకు మించి అదిగాని, నేనుగాని, దాని తండ్రిగాని ఆ పరిస్థితుల్లో చేయగలిగిందేం లేదు.

పెళ్లయింది. అత్తగారింటికి వెళ్లింది.

అక్కడ కాలు పెట్టిం తరువాత దానికి సవతి తల్లే చాలా మంచిదనిపించింది. ఎన్ని మాటలన్నా, ఎంత కర్కశంగా ప్రవర్తించినా కడుపునిండా తిననిచ్చేది. అక్కడ వాళ్లకు అదీ ఇష్టం లేదు. తిన్నా తినకపోయినా ఇంటెడు చాకిరీ చేయక తప్పేది కాదు.

ఆరునెలలో తల్లికాబోతున్న ఆమె ఒక రోజు నీరసంతో కళ్లు తిరిగి పడిపోతే, పుట్టింట్లో దించేసి వెళ్లిపోయాడు సవతి తల్లిగారి తమ్ముడంటే దాని మొగుడు. దానికి మందులిప్పించి, మామూలు మనిషి చేసి, పిల్లాడు పుట్టింతరువాత తీసుకొచ్చి దించండి అంటూ ఓ ఆజ్ఞ చేసి.

నేను వెళ్లి చూశాను. శవంలా తయారయింది.

నాకు ఏడుపొచ్చింది.

నిగ్రహించుకున్నాను.

భుజం తట్టి ధైర్యం చెప్పి ఇంటికి వచ్చేశాను.

సవతి తల్లి పనికి పనికిరాని దాన్ని తిట్టిపోస్తూ, ఇంత ఉడకేసి దాని మొహాన కాస్తో కూస్తో పడేసేది ఆమె తండ్రి చూస్తుండగా. అప్పటికి అది తను చేయగలిగిన పని చేస్తూనే వుండేది.

పుట్టింది ఆడపిల్ల.

మొగుడూ, అత్తగారూ వచ్చి తిట్టిపోసారు. బుద్ధితక్కువ పనిచేసిందంటూ. పాపం అదేం చేస్తుంది. అది దాని చేతిలో పనా?

మూడు నెలల తరువాత తల్లీని, పిల్లనూ తీసుకువచ్చి అత్తగారింట్లో దించాడు తండ్రి. ఏడుస్తూ, మొత్తుకుంటూ లోపలకు రానిచ్చారు.

సరిగ్గా ఆరునెలలు తిరిగే టప్పటికి, ఆ తాగుబోతు మొగుడు ఓ రోజు గుర్రమెక్కి ఎదురుగ్గా వస్తున్న లారీని గుద్దేసి హరీమన్నాడు. వాడు చేస్తే చచ్చాడు. దానికి మరోసారి కడుపు చేసి చచ్చాడు.

కష్టాల మీద కష్టాలు వస్తాయంటే ఇదే మరి.

నాకు ఏడుపొచ్చింది.

నిగ్రహించుకున్నాను.

నా బికాం అయింది. మానాన్న సిఏలో జేరతావా అని అడిగాడు. అమ్మ నాకో మొగుడిని చూడమంటుంది. ఇంట్లోని ఇద్దరి గోలతో వాళ్లకు చెప్పకుండా నేను అప్లయి చేసిన బ్యాంకు ఉద్యోగం రావడంతో ముందు దాంట్లో చేరిపోయాను.

సుశీల పుట్టింటికి చేరి ప్రైవేటుగా టెన్త్‌కుకట్టి చదువుధ్యాసలో పడింది.

దాని విషయంలో అది పడ్డ కష్టాలు చూసి సవతి తల్లికి జాలిపుట్టిందో, ఎన్నేళ్లయినా తను తల్లి కాలేకపోవడంతో ఆయనగారి మొదటి భార్యపిల్లలే ఇక తన పిల్లలు అని మనసుకు సర్ది చెప్పుకున్నదో...మొత్తానికి సుశీలను ఇదివరకటిలా తిట్టిపోయడం లేదు.

చిన్నగా సుశీల బిఏ పాసయి, బిఇడి చేసి ఓ ప్రైవేటు స్కూల్లో టీచరుగా చేరి గుట్టుగా కాలం వెళ్లదీయసాగింది.

అటువంటి సమయంలోనే! ఓ రోజు రాత్రి సుశీల తండ్రి వచ్చి మా నాన్నతో సంతోషంగా చెప్పాడు. సుశీల కొన్న భూటాన్ లాటరీ టిక్కెట్టుకు యాభై లక్షల ప్రైజు వచ్చిందని!

ఆ మాటలు వింటూనే నేను బిత్తరపోయాను.

నాకు ఏడుపు వచ్చింది.

ఎంత నిగ్రహించుకుందామనుకున్నా నిగ్రహించుకోలేకపోయాను.

★